ప్రజాశక్తి
బుధవారం 12 జూలై 2023
5
శ్రీకాకుళం

# అంగన్వాడీల అరెస్టు



అంగన్వాడీ కార్యకర్తను అరెస్టు చేస్తున్న పోలీసులు



అంగన్వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు

- కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్తున్న వారిని అడ్డుకున్న పోలీసులు
- ప్రతిఘటించిన అంగన్‌వాడీలు
- 70 మంది అరెస్టు, విడుదల
- ముగిసిన 36 గంటల మహాధర్నా

**ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, అర్బన్**

ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంపు, తెలంగాణ కన్నా అదనంగా వేతనాల చెల్లింపు, గ్రాట్యుటీ తదితర డిమాండ్లతో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన చేపట్టిన 36 గంటల మహాధర్నా రెండో రోజు మంగళవారంతో ముగిసింది. తమ సమస్యలపై 24 గంటలుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఆగ్రహిస్తూ కలెక్టర్‌ను కలిసి మాస్ మెమోరాండం ఇచ్చేందుకు ర్యాలీగా బయలుదేరారు. అప్పటికే అక్కడ భారీగా మోహరించిన పోలీసులు, వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అంగన్‌వాడీలు ప్రతిఘటించడంతో పోలీసులకు, వారికి మధ్య తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అంగన్‌వాడీలను దొరికిన వారిని దొరికినట్లుగా బలవంతంగా ఈడ్చుకుంటూ వాహనాల్లోకి ఎక్కించి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.సుధ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావుతో పాటు ధర్నాకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు సహా 70 మందిని అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

మహాధర్నాలో భాగంగా ఈనెల పదో తేదీన వంటావార్పు చేసి అక్కడే నిద్రించిన కార్యకర్తలు, హెల్పర్లు ఉదయాన్నే తమ ధర్నాను కొనసాగించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన మిగిలిన కార్యకర్తలు వారితో జత కలిశారు. తెలంగాణ మాదిరిగా వేతనాలు ఇవ్వాలని, గ్రాట్యుటీ అమలు చేయాలంటూ నినాదాలు చేశారు. ఉదయం తొమ్మిది గంటల సమయంలో పోలీసులు తమ వాహనాలతో అక్కడకు సమీపంలోని ఆర్అండ్‌బి బంగ్లా వద్దకు చేరుకున్నారు. కలెక్టర్‌కు మాస్ మెమోరాండం ఇచ్చేందుకు బయలుదేరేందుకు సిద్ధమవుతున్నారన్న సమాచారంతో ధర్నా ప్రాంతమైన జ్యోతిబాపూలే పార్కు సమీపానికి పోలీసులు, వాహనాలు చేరుకున్నాయి. ర్యాలీగా బయలుదేరిన వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.సుధ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు తదితరులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కలెక్టరేట్‌లోకి అనుమతి ఇచ్చేది లేదంటూ పోలీసులు తేల్చిచెప్పడంతో నాయకులు, అంగన్‌వాడీలు ముందుకు చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించడంతో వారి మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో పోలీసులు అరెస్టులకు దిగారు. ఆందోళనకారులను దొరికిన వారిని దొరికినట్లుగా ఈడ్చుకుంటూ వాహనాల్లో పడేశారు. ఈ క్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి కళ్యాణి స్పృహ కోల్పోయారు. ఆమెకు మంచినీళ్లు అందించి వేరే వాహనంలో తీసుకెళ్లారు. అరెస్టయిన వారిలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు కె.కళ్యాణి, జె.కాంచన, పి.లతాదేవి, రాజేశ్వరి బి.ఆదిలక్ష్మి, కె.సుజాత, జయలక్ష్మి తదితరులున్నారు.



తోపులాటలో స్పృహ కోల్పోయిన కళ్యాణి

### సమస్యలు పరిష్కారం మాని అరెస్టులా..?

ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.సుధ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ తమ డిమాండ్లను పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలను అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. అంగన్‌వాడీల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండించారు. తెలంగాణ కన్నా అదనంగా రూ.వెయ్యి పెంచుతామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ అమలు చేయాలని కోరితే పోలీసులతో అంగన్‌వాడీలను అరెస్టు చేయించడం ఏమిటని ప్రశ్నించారు. అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరినా ప్రభుత్వం స్పందించకపోవడం అంగన్‌వాడీలపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోందన్నారు. రకరకాల యాప్‌లు తెచ్చి వారిపై పనిభారం పెంచారని, పర్యవేక్షణ పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాదీ ఐసిడిఎస్‌కు బడ్జెట్‌లో కోత పెడుతోందన్నారు. స్కీమ్‌వర్కర్లు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.ఐదు లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు.

### పోరాటం ఉధృతం చేస్తాం

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు హెచ్చరించారు. అంగన్‌వాడీల మహాధర్నాకు సంఘీభావం ప్రకటించిన ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యుటీ వంటి సౌకర్యాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలను అక్రమంగా అరెస్టులు చేయడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు.

### పలు సంఘాల సంఘీభావం

మహాధర్నాకు పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కె.గణపతిరావు, డి.చంద్రశేఖర్, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎం.గోవర్ధనరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సింహాచలం, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి పి.ప్రసాదరావు, సిఐటియు జిల్లా నాయకులు ఎస్.లక్ష్మీనారాయణ కె.సూరయ్య, ఎ.సత్యనారాయణ, ఎం.ఆదినారాయణమూర్తి, పలు సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.

## సెప్టెంబర్ 24న రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు

**ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్**

రాష్ట్రస్థాయి ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీలను సెప్టెంబరు 24న శ్రీకాకుళం నగరంలో నిర్వహించనున్నట్లు 999, ఫ్లెక్స్ జిమ్ అధినేతలు శివకుమార్, గౌరీశంకర్ తెలిపారు. నగరంలోని ఫ్లెక్స్ జిమ్‌లో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఎన్నడూ లేని విధంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన బాడీ బిల్డర్లతో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అసోసియేషన్‌తో సంబంధం లేకుండా ఆంధ్ర, తెలంగాణకు చెందిన బాడీ బిల్డర్లు ఈ పోటీల్లో పాల్గొనేందుకు వీలు కల్పిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో సీనియర్ బాడీ బిల్డర్లు, జిమ్ అధినేతలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సింగ్, వైటిహెచ్ సూరి, జిలాని, రాయితీ చంద్రశేఖర్ (గబ్బర్), పైల చంద్రశేఖర్ (కుంగ్‌ఫు శేఖర్), కరాటే శిక్షకులు రెడ్డి ఢిల్లేశ్వరరావు, మానెం గోపి, బి.వి రావు తదితరులు పాల్గొన్నారు.




పోస్టర్‌ను విడుదల చేస్తున్న బాడీ బిల్డర్లు



నందిగాంలో సంఘీభావ పాదయాత్ర చేస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

## అరాచక పాలనను అంతమొందించాలి

### ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

**ప్రజాశక్తి - నందిగాం, పొందూరు**

రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనను అంతమొందించాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ పిలుపునిచ్చారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర రెండు వేల కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం నందిగాం, పొందూరులో సంఘీభావ పాదయాత్రలు చేపట్టారు. నందిగాం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయం నుంచి పెంటవూరు వరకు చేపట్టిన పాదయాత్రలో ఎంపీ రామ్మోహన్ నాయుడు, పొందూరు మండలంలోని రాపాక కూడలి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ చేపట్టిన పాదయాత్రలో రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అవినీతి, దౌర్జన్యాలు, వైఫల్యాలను తెలియజేస్తూ సాగుతున్న లోకేష్ పాదయాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతుంటే తట్టుకోలేని వైసిపి ఎమ్మెల్యేలు, నాయకులు వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని దుయ్యబట్టారు. టిడిపి ప్రభుత్వ హయాంలో అభివృద్ధిలో ముందున్న ఆంధ్రప్రదేశ్‌ను వైసిపి ప్రభుత్వం అప్పుల్లో ముందంజలోకి తీసుకెళ్లిందని ఎద్దేవా చేశారు. ముద్దులు పెట్టి మాయమాటలు చెప్పిన జగన్, అధికారం చేపట్టాక ప్రజలను అన్నిరకాలుగా ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. సంక్షేమ పథకాల పేరిట భారాలు మోపారని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిగేలా ప్రతి కార్యకర్తా చిత్తశుద్ధితో పనిచేయాలని పిలుపునిచ్చారు. వైసిపి ప్రభుత్వ, నాయకుల తీరును ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, టిడిపి పొందూరు, బూర్జ మండల అధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహనరావు, వావిలపల్లి సీతారామారావు(రాంజీ), నాయకులు కూన వెంకటసత్యనారాయణ, బలగ శంకరభాస్కరరావు, బోయిన గోవిందరాజులు, ఎం.బాలకృష్ణ, పి.అజయ్ కుమార్, కె.ప్రసాదరావు, పి.చంద్రశేఖరరావు, బగాది శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



పొందూరులో పాదయాత్ర చేస్తున్న కూన రవికుమార్

## జనాభా నియంత్రణతో జీవన ప్రమాణాలు మెరుగు

**ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్**

దేశ ఆర్థికాభివృద్ధిలో మానవ వనరుల ప్రాముఖ్యం ఎక్కువని, జనాభా తక్కువ ఉన్న దేశాల్లో జీవన ప్రమాణాలు ఎంతో మెరుగ్గా ఉంటాయని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన ర్యాలీని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పిలుపునిస్తున్నాయని, ఆ దిశగా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచ జనాభా 800 కోట్లు ఉండగా ఒక్క భారతదేశంలోనే 142 కోట్ల మంది ఉన్నారని, జనాభా నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. జనాభా నియంత్రణ అనేది సామాజిక బాధ్యతగా గ్రహించి ముందుకొచ్చి జనాభా నియంత్రణకు కృషి చేయాలని కోరారు. 25 నుంచి 60 ఏళ్ల లోపు వయసు వారు 60 శాతం మనదేశంలో ఉన్నారని వీరందరికీ పని కల్పించి, మానవ వనరులను సక్రమంగా వాడుకోవడానికి చర్యలు తీసుకోవాలన్నారు. చైనా తరహాలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభా నియంత్రణకు అడుగులు వేయాల్సి ఉందన్నారు. ప్రపంచంలో భారత్ అగ్రగామి దేశంగా ఎదుగుతుందని భవిష్యత్‌లో ఆర్థిక సూపర్ పవర్‌గా నిలుస్తుందని చెప్పారు. ఆరోగ్య సంరక్షణ, నాణ్యమైన విద్య, ఉద్యోగాల నైపుణ్యం కోసం జనాభా నియంత్రణ అత్యవసరమన్నారు.

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి మాట్లాడుతూ జిల్లాలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు అనుకున్నంత స్థాయిలో జరగడం లేదన్నారు. కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మినహా మిగిలిన చోట్ల జరగడం లేదని తెలిపారు. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు ప్రోత్సహించడంలో ఉత్తమ సేవలు అందించిన వారికి నగదు పారితోషికం ఉంటుందన్నారు. అనంతరం ఏడు రోడ్ల కూడలి వద్ద కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, ఎడిఎంహెచ్ఒ బి.అనురాధ, డిపిఆర్ఒ కె.బాలమాన్‌సింగ్‌కు జ్ఞాపికలు అందజేశారు. కు.ని శస్త్ర చికిత్సలు నిర్వహించడంలో ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రోత్సాహక బహుమతి, సర్టిఫికెట్లను బహుకరరించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలైన అవని స్కూల్ అఫ్ నర్సింగ్, విజయా నర్సింగ్ విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డిసిహెచ్ భాస్కరరావు, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, సమాజ సేవకులు మంత్రి వెంకటస్వామి, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.




జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

## పిడుగుపాటుకు వృద్ధుడు మృతి

**ప్రజాశక్తి - లావేరు**

పిడుగుపాటుకు గురై మండలంలోని చిన్నకొత్తకోటకు చెందిన వంగమూడి తవిటయ్య (77) మంగళవారం మృతి చెందాడు. గ్రామానికి సమీపంలోని పొలాల్లో మంగళవారం మధ్యాహ్నం ఆవులు మేపుతుండగా, భారీ వర్షం కురిసింది. అదే సమయంలో పిడుగు పడడంతో శరీరం సగానికి పైగా కాలిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. తవిటయ్యను గమనించిన స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. 108 సిబ్బంది కె.ఈశ్వరరావు, సత్యనారాయణ బాధితునికి ప్రథమ చికిత్స అందించి శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆస్పత్రిలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఇద్దరు కుమారులు విజయవాడలో ఉపాధి నిమిత్తం వెళ్లి అక్కడ ఉంటున్నారు. భార్య సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి జి.రామారావు తెలిపారు.



తవిటయ్య

## బ్యాడ్మింటన్ క్రీడాకారిణికి జెసి అభినందన

**శ్రీకాకుళం :** ఈనెల 9, 10 తేదీల్లో ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో నిర్వహించిన జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో శ్రీకాకుళం నగరానికి చెందిన బలగ లక్ష్మీహర్ష పతకాన్ని సాధించింది. ఆలిండియా స్థాయిలో ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో హర్ష పాల్గొని విజయం సాధించడంపై జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ లక్ష్మీహర్షను తన ఛాంబర్‌లో మంగళవారం అభినందించారు. విక్రాంత్ బ్యాడ్మింటన్ అకాడమీ ద్వారా శిక్షణ పొందుతున్న లక్ష్మీహర్షను పలువురు ప్రముఖులు, క్రీడాసంఘాలు అభినందించాయి. త్వరలో బీహార్ రాష్ట్రం గయలో నిర్వహించనున్న జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు లక్ష్మీహర్ష అర్హత సాధించారు.

## అవినీతికి పాల్పడితే క్రిమినల్ చర్యలు

### డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు

**ప్రజాశక్తి - కోటబొమ్మాళి**

ఉపాధి హామీలో చనిపోయిన వారి పేరున, పనికి రాని వారి పేరున మస్టర్లు వేస్తే ఆ మొత్తాన్ని సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి రికవరీ చేయించడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు హెచ్చరించారు. గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజా వేదికను స్థానిక మండల పరిషత్ కార్యాలయ అవరణలో మంగళవారం నిర్వహించారు. మండలంలోని కురుడులో మృతి చెందిన వారి పేరు మీద మస్టర్ వేశారని, కూలీల నుంచి వారానికి రూ.వంద వసూలు చేశారని, దంతలో ముగ్గురికి మృతి చెందిన తర్వాతా మస్టర్లు వేశారని, నారాయణవలసలో ప్రైవేటు ఉపాధ్యాయురాలికి పనికి రాకుండా మస్టరు వేశారని సామాజిక తనిఖీ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చాలా పంచాయతీల్లో చనిపోయిన వారి పేర్లు మీద మస్టర్లు వేస్తున్నారని పత్రికల్లో కథనాలు వస్తున్నాయని, ఈ మండలంలో అలా ఎవరైనా చేస్తే ఆ మొత్తం చెల్లించి ఇంటికి వెళ్లాలన్నారు. ఒకే కుటుంబానికి ఒకే జాబుకార్డు ఉండాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామంలో చేసిన పనికి సంబంధించి సర్పంచ్, ఎంపిటిసి, ఎంపిపి, జెడ్‌పిటిసిలకు తెలియజేయాలని స్పష్టం చేశారు. అలా చేయని వారికి ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తొలగిస్తామని హెచ్చరించారు. అనంతరం నిర్వహించిన ప్రజావేదికలో 38 పంచాయతీలకు గానూ 14 గ్రామ పంచాయతీలకు సంబంధించి పలు తప్పులకు గానూ రూ.50,869లు రికవరీ చేస్తున్నట్లు పీడీ తెలిపారు. రికవరీ చెల్లింపుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన చెల్లింపులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, ఎపిడి కె.మురళీకృష్ణ, ఎస్.హేమసుందరరాజు, అన్నెపు రామారావు, పేడాడ వెంకటరావు, ఎపిఒలు, సామాజిక తనిఖీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు




మాట్లాడుతున్న వ్య.కా.స జిల్లా అధ్యక్షులు ప్రసాద్

## అదనపు పరిహారం చెల్లించాలి

**ప్రజాశక్తి - హిరమండలం**

వంశధార నిర్వాసితులకు అదనపు పరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని శాస్త్రులపేటలో వ్యవసాయ కార్మిక సంఘం విస్తృతస్థాయి సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా జగన్మోహన్ రెడ్డి 2013 భూసేకరణ చట్టం అమలు చేస్తామని ఇచ్చిన హామీని నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. రూ.లక్ష అదనపు పరిహారం కొంతమంది నిర్వాసితులకు ఇచ్చి, మిగిలిన వారికి ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. పెండింగ్‌లో ఉన్న పరిహారం ఎప్పుడు ఇస్తారో ప్రభుత్వం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజల మద్దతుతో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘ నాయకులు తులసీరావు, లక్ష్మీనారాయణ, ప్రసాద్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల తప్పుకి ఉపాధ్యాయురాలికి శిక్ష : యుటిఎఫ్

**ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్**

ఇటీవల నిర్వహించిన బదిలీల్లో ఖాళీలు చూపించడంలో విద్యాశాఖ అధికారులు తప్పు చేసి, ఉపాధ్యాయురాలిని బలి చేయడం సరికాదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌లో సంతబొమ్మాళి మండలం డోల గోవిందపురం ఖాళీ కోరుకున్న ఎల్ఎఫ్ఎల్ ఉపాధ్యాయురాలు బి.భారతిని జిల్లా విద్యాశాఖ అధికారులు భయపెట్టి సారవకోట మండలానికి బదిలీ ఆర్డర్లు మంజూరు చేయడాన్ని ఖండించారు. సంతబొమ్మాళి మండలం డోల గోవిందపురంలో ఎల్ఎఫ్ఎల్ ఖాళీ లేకపోయినా విద్యాశాఖ అధికారుల తప్పిదం వల్ల ఖాళీ చూపించడం వల్ల ఉపాధ్యాయురాలు భారతి కోరుకుందని తెలిపారు. ఆమె అనుమతి లేకుండా బెదిరించి సారవకోట మండలానికి బదిలీ చేయడం సరికాదని పేర్కొన్నారు. ఆమెకి న్యాయం చేయకుంటే ప్రత్యక్ష పోరాటం తప్పదని హెచ్చరించారు. బదిలీల సందర్భంగా కేడర్ స్ట్రెంత్ వెంటనే జిల్లా ట్రెజరీ కార్యాలయానికి పంపాలని, జీతాల సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.

## తుపాన్లపై అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్**

తుపాన్ల సమయంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. దక్షిణ, పశ్చిమ రుతుపవనాలకు సంబంధించి జిల్లా అధికారులతో ముందస్తు సమావేశాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. తుపాన్లకు వరదలు వచ్చే ప్రమాదం ఉన్నందున ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో మరమ్మతు పనులు ఉంటే తక్షణమే చేయించి, సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. కేంద్రాల్లో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. నాగావళి, వంశధార నదులకు అతి ప్రమాదకరమైన గ్రామాలను గుర్తించి వరద రాకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఎస్ఇ సుధాకర్‌ను ఆదేశించారు. జెసిబిలు, క్రేన్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జనరేటర్లు, తాగునీరు, వాటర్ ప్యాకెట్లు, బ్లీచింగ్ పౌడర్ మండలాలకు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

ఎస్‌పి జి.ఆర్ రాధిక మాట్లాడుతూ రెవెన్యూ, ఇతర శాఖలతో కలిసి ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటుకు అన్ని సిద్ధం చేసుకున్నట్లు వివరించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. డివిజినల్ స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ, ఆర్‌డిఒలు బి.శాంతి, సీతారామ్మూర్తి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ప్రసాదరావు, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, వంశధార ఎస్ఇ డోల తిరుమలరావు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, వ్యవసాయ శాఖ జెడి కె.శ్రీధర్, పౌర సరఫరాల జిల్లా అధికారి రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

## ప్రజా సమస్యల పరిష్కారానికే 'సురక్ష'

### రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

**ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్**

ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని టౌన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజల అవసరాలను తీర్చడంలో ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు. మౌలిక వసతులు కల్పించి నేరుగా సేవలు అందిస్తున్నామన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. నగరంలోని నిరుపేదలకు సొంత ఇంటి కలను నిజం చేయాలన్న సంకల్పంతో 15 వేల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం అర్ధాంతరంగా విడిచిపెట్టిన టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడంతో పాటు నగరానికి ధీటుగా అక్కడ మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. ఏఒక్కరూ తమకు ప్రభుత్వ పథకం అందలేదన్న నిరాశ చెందకూడదన్న లక్ష్యంతో అధికారులనే ప్రజల వద్దకు తీసుకురావడమైందని, 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఇంటి వద్దే అందజేస్తున్నామన్నారు. నగరంలో మార్కెట్‌ను అభివృద్ధి చేశామని, ప్రజలు కోరుకున్న రీతిలో నిరంతరం సేవలు అందుతున్నాయన్నారు. గత ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందో విజ్ఞతతో ఆలోచించాలన్నారు. మళ్లీ ఎన్నికలు రాబోతున్న తరుణంలో ప్రజలు ఆలోచించుకుని గత, ప్రస్తుత ప్రభుత్వాల మధ్య వ్యత్యాసాన్ని అంచనా వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, ఊణ్ణ నాగరాజు, మండవల్లి రవి, కోణార్క్ శ్రీను, పొన్నాడ రుషి, సాధు వైకుంఠరావు, అంధవరపు రామారావు తదితరులు పాల్గొన్నారు.



సావనీర్‌ను విడుదల చేస్తున్న మీనాక్షి

## గ్రామాల్లో పిఎంపిల సేవలు అవసరం

### జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి మీనాక్షి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గ్రామీణ ప్రాంతాల్లో సకాలంలో వైద్య సేవలు అందించడంలో ప్రయివేటు ప్రాక్టీషనర్లు కీలకంగా ఉన్నారని, వారు అందిస్తున్న సేవల వల్ల ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయని డిఎంహెచ్‌ఒ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. పిఎంపి అసోసియేషన్ 60 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో పిఎంపి అసోసియేషన్ సావనీరును మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎన్.అనురాధ, పిఎంపిల అసోసియేషన్ అధ్యక్షుడు వండాన సిమ్మన్న, కార్యదర్శి కె.సూరిబాబు, ట్రెజరర్ నక్క లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు ఎ.ఆదినారాయణ, జాయింట్ సెక్రెటరీ కె.జనార్ధనరావు పాల్గొన్నారు.

## 'ఐతమ్' అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



స్వప్నరేఖ

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా హనుమంతు స్వప్నరేఖ విధులు నిర్వహిస్తున్నారు. ఇంజినీరింగ్ విభాగంలో ఒడిశాకు చెందిన బుర్లా వీర సురేంద్ర సాయి యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ పిహెచ్ పట్టాను జారీ చేసిందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ హిమాన్స్ శేఖర్ బెహరా మార్గదర్శకత్వంలో 'ఇంటలిజెంట్ కంప్యూటింగ్ ఫర్ కంబేటింగ్ కోవిడ్-19: యాన్ ఎక్స్పరిమెంటల్ పెర్స్పెక్టివ్' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టర్ స్వప్నరేఖకు ఈ పిహెచ్ డిగ్రీని విఎస్ఎస్‌ఆర్‌టి మంజూరు చేసిందన్నారు. డాక్టరేట్ సాధించడంపై నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ ఆరె డాక్టర్ డి.ఆజాద్, ఐటి హెచ్‌డి డాక్టర్ వై.రమేష్ అభినందించారు.

## ఎజిపిగా దేవరాజ్‌రెడ్డి



దేవరాజ్‌రెడ్డి

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం బార్ అసోసియేషన్ సభ్యులు రేవాడ దేవరాజ్‌రెడ్డిను గవర్నమెంట్ అసిస్టెంట్ ప్లీడర్‌గా నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇచ్ఛాపురం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మూడేళ్ల పాటు ఎజిపి పదవీ బాధ్యతలు నిర్వహించనున్నారు. ఎజిపిగా దేవరాజ్‌రెడ్డి నియామకంపై బార్ అసోసియేషన్ సభ్యులు మనోజ్‌కుమార్, సామంత, న్యాయవాదులు ఎన్.రమణయ్య, ఏ.భైరాగి, ఎస్.వి.ఎస్.రంగారావు, ఎస్.ఎల్.నారాయణ, కె.ప్రసాద్, ఐఎఎల్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నాగరాజ్ పాత్రో హర్షం వ్యక్తం చేశారు.

## చెల్లాయివలసలో గడప గడపకు...

పోలాకి: మండలంలోని చెల్లాయివలసలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, ఎంపిటిసి కోట అప్పారావు, సర్పంచ్ జగ్గునాయిడు, రామకృష్ణ, వైసిపి నాయకులు ఆర్.త్రినాథరావు పాల్గొన్నారు.



పోస్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

# అర్హులు పథకాలకు దూరం కాకూడదు

ప్రజాశక్తి- బూర్జ

అర్హులైన ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కాకుండా, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని చీడివలస, గుత్తావల్లి సచివాలయాల పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న చిన్న సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందని అర్హులందరికీ సమగ్రంగా, సంపూర్ణంగా, సంతృప్తికర స్థాయిలో అందించడమే జగనన్న సురక్ష అని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు.

**పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు సరికావు**

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ గ్రామ వాలంటీర్లను అవమానకరంగా మాట్లాడి మహిళలపై ఆయనకున్న చిత్తశుద్ధిని మరోసారి నిరూపించుకున్నారని అన్నారు. బహిరంగ వేదికపై గ్రామ వాలంటీర్లపై పవన్ చేసిన వ్యాఖ్యలు అవమానకరంగా ఉన్నాయన్నారు. ముందుగా మహిళా వాలంటీర్లు ముందుకొచ్చి పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి కర్నేన దీప, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, మండల పార్టీ అధ్యక్షులు ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు గుమ్మడి రాంబాబు, సర్పంచ్ జీడి వేణు పాల్గొన్నారు.

**జి.సిగడాం:** ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పెంట, సీతంపేట సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు అందించేందుకు వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారునికీ 11 రకాల సేవలను ఉచితంగా జగనన్న సురక్ష ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయలు రమణ, సర్పంచ్ పున్నాన సోనియా, గేదెల మల్లిబాబు, ఎంపిటిసి మక్క శ్రీలత, ఎంపిడిఒ కె.నిశ్చల, తహశీల్దార్ పప్పల వేణుగోపాలరావు, డిటి ఎన్.నిర్మల, ఎంఇఒ అరసాడ రవి, ఇఒపిఆర్‌డి ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**వజ్రపుకొత్తూరు :** జగనన్న సురక్ష కార్యక్రమంతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పాలిన శ్రావణి అన్నారు. మండలంలోని గోవిందపురం సచివాలయం ఆవరణలో సర్పంచ్ ప్రతినిధి పాలిన ఉమామహేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు, ఉద్దానం గోపినాథపురం, అమలపాడు సర్పంచ్‌లు కర్ని శ్రీను, దున్న రత్నం బాలరాజు, మండల ప్రత్యేక అధికారి మట్ట రవికృష్ణ, ఎంపిడిఒ ఈశ్వరమ్మ, డిటి గిరిరాజ్ పశువైద్యాధికారి రాజ్‌కిరణ్, మండల ఎఒ కిరణ్‌వాణి పాల్గొన్నారు.

**పలాస:** సమస్యలతో సతమతమవుతున్న ప్రజలకు జగనన్న సురక్ష ఒక వరమని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మున్సిపల్ పరిధిలో గాంధీనగర్, చిన్నబడాం సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్షలో 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు, బోర కృష్ణారావు, మున్సిపల్ విప్ దుర్గా శంకర్ పండా, దువ్వాడ శ్రీకాంత్, బెల్లాల శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, టిపిఒ సీతారాం పాల్గొన్నారు.

సమస్య లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే జగన్ లక్ష్యమని అమలకుడియా సర్పంచ్ కొర్ల శిరీష అన్నారు. మండలంలోని అమలకుడియా సచివాలయంలో జగనన్న సురక్ష నిర్వహించారు. కార్యక్రమంలో కొర్ల మురళీకృష్ణ చౌదరి, మండల ప్రత్యేక అధికారి పోతనపల్లి చంద్రశేఖర్, ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

**నందిగాం:** మండలంలోని రదజనబొడ్డపాడులో సర్పంచ్ బొడ్డపాటి తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్షలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులకు 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు బార్నాన బాలకృష్ణ, సైలాడ లావన్న, ఎంపిడిఒ జి.శివప్రసాద్, డిటి భాగ్యలక్ష్మి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, మండల ఎఒ శ్రీకాంత్ వర్మ పాల్గొన్నారు.

**జలుమూరు:** మండలంలోని చల్లవానిపేట, జోనంకి సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న సురక్షలో పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య, ఎంపిపి వాన గోపి పాల్గొని ధ్రువపత్రాలను అందజేశారు. వైసిపి మండల కన్వీనర్ కనుసు సీతారాం, వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, జెసిఎస్ కన్వీనర్ జగన్మోహనరావు, జోనంకి సర్పంచ్ జి.రమణమ్మ, ఎంపిడిఒ ఎల్.వి.అప్పారావు, తహశీల్దార్ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

**కంచిలి :** మండలంలోని కుమ్మరినౌగాం సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్షలో జెడ్‌పిటిసి ఇప్పిలి లోలాక్షి, ఎంపిపి దేవదాస్‌రెడ్డి, ఎంపిడిఒ చల్ల శ్రీనివాసరెడ్డి, తహశీల్దార్ హైమావతి, సర్పంచ్‌లు హరిబందు జన్ని, రామచంద్ర ప్రధాన్, వైసిపి మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం, పిఎసిఎస్ చైర్మన్ గుమ్మిడి రామదాసు, ఆర్‌బికె అధ్యక్షులు లడ్డు కేశవ్‌పాత్రో పాల్గొన్నారు.

**కోటబొమ్మాళి:** కోటబొమ్మాళి, యలమంచిలి సచివాయాల్లో నిర్వహించిన జగనన్న సురక్షలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, తహశీల్దార్ జామి ఈశ్వరమ్మ, మండల ప్రత్యేకాధికారి మంద లోకనాథం పాల్గొన్నారు.

**సోంపేట** మండలంలోని కొర్లాంలో నిర్వహించిన జగనన్న సురక్షలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. ఎంపిపి నిమ్మన దాసు, పిఎసిఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, ఉద్దాన శ్రీకృష్ణ, హేమలత, శ్రీనివాసరావు, మోహనరావు, చంద్రశేఖరం పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం :** పట్టణంలోని బెల్లుపడ సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్షలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ పాల్గొని 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న శ్రావణి



పలాస : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న చైర్మన్ గిరిబాబు



బూర్జ : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న స్పీకర్ సీతారాం



జి.సిగడాం : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న గురునాథ్

**మెళియాపుట్టి :** ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే జగనన్న సురక్ష అని ఎంపిడిఒ పి.చంద్రకుమారి అన్నారు. మండలంలోని గొప్పిలిలో జగనన్న సురక్షలో 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డిటి శంకరరావు, ఎంఇఒ ఎస్.దేవేందర్‌రావు, మండల ఎఒ దాణకర్ణుడు, ఎపిఎం లలిత, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, సర్పంచ్ జయసుధ పాల్గొన్నారు.

**టెక్కలి రూరల్ :** జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు మేలు కలుగుతుందని సురక్ష స్పెషల్ అధికారి డాక్టర్ జి.గురునాథ్ అన్నారు. మండలంలోని మేఘవరం సచివాలయంలో జగన్న సురక్ష నిర్వహించి 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ హెచ్.వి.రమణమూర్తి, డిటి ఎస్.రవికూమార్, ఎపిఒ బగాది ప్రసాదరావు, కార్యదర్శి కూర్మారావు, విఆర్‌ఒ టి.శ్యామ, సర్పంచ్ పులిబందల జయలక్ష్మి, ఎంపిటిసి జన్ని మంగమ్మ పాల్గొన్నారు.

**టెక్కలి :** మండలంలోని నర్సింగపల్లి సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్షలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి, తహశీల్దార్ కురమాన ప్రవల్లికాప్రియ, ఎంపిడిఒ హనుమంతు వెంకటరమణమూర్తి, వైస్ ఎంపిపి పేడాడ రమేష్, ఎంపిటిసి రౌతు బృందావతి, సర్పంచ్‌లు గుజ్జు మోహన్‌రెడ్డి, కె.కామేశ్వరరావు, బుసకల శ్రీనివాసరావు, మెండ భాస్కరరావు, పోలాకి వీరవసంతులు పాల్గొన్నారు.



ఆమదాలవలస : మానవహారం నిర్వహిస్తున్న వాలంటీర్లు

## వాలంటీర్ల ధర్నా

ప్రజాశక్తి- ఆమదాలవలస

వాలంటీర్ల వ్యవస్థపై సినీ నటుడు పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు సరికాదని, తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ అన్నారు. పట్టణంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయం నుంచి వన్ వే కూడలి వరకూ వాలంటీర్లతో కలిసి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆదివారం ఏలూరులో నిర్వహించిన సభలో నిస్వార్థంగా పనిచేస్తున్న వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. కోవిడ్ సమయంలో ప్రతి ఇంటి తలుపును తట్టి సేవలను అందించారని అటువంటి వారిపై హ్యూమన్ ట్రాఫికింగ్ చేస్తున్నారని అనడం భావ్యం కాదని అన్నారు. ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, వాలంటీర్లకు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వాలంటీర్ల వ్యవస్థని రద్దు చేస్తామని చెప్పే ధైర్యం పవన్‌కు ఉందా? అని ప్రశ్నించారు. అనంతరం వాలంటీర్లు పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో తొగరాం సర్పంచ్ తమ్మినేని వాణి, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, గ్రామ సచివాలయాల కన్వీనర్ బొడ్డేపల్లి నిరంజన్‌బాబు, బుడుమురు సూర్యారావు, కూటికుప్పల సన్యాసిరావు, మామిడి రమేష్‌కుమార్, గొంటి కృష్ణ, బొడ్డేపల్లి సత్యం, కూన రామకృష్ణ పాల్గొన్నారు.

**నందిగాం:** వాలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని కోరుతూ నందిగాంలో ధర్నా చేవారు. కార్యక్రమంలో ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, సర్పంచ్‌లు కణితి నారాయణమూర్తి, పోలాకి మోహనరావు, అట్టాడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం

**పొందూరు :** విజయనగరం జిల్లా సంతకవిటి మండలం అప్పలగ్రహారానికి చెందిన యువతి (20) సోమవారం పొందూరులో డిగ్రీ పరీక్ష రాయడానికి వచ్చి తిరిగి రాలేదంటూ తండ్రి కె.అసిరప్పడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు ఎస్ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేశారు. యువతి జి.సిగడాం మండలం వాంద్రంగి వద్ద గల శ్రీరామ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతుంది. సోమవారం స్థానిక సిస్టమ్ కళాశాలలో పరీక్షలకు హాజరైంది. అనంతరం ఇంటికి రాకపోవడంతో కళాశాలతో పాటు, పొందూరు బస్టాండ్‌లోను, రైల్వేస్టేషన్‌లోను, బంధువుల ఇళ్లల్లోను వెతికారు అయినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ఎమ్మెల్యే పరామర్శ

**లావేరు :** మండలంలోని పెద్దమురపాకలో వైసిపి నాయకులు తేనెల మంగయ్య మాస్టరు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మంగళవారం పరామర్శించారు. పెద్దమురపాక పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి పెయ్యల లక్ష్మణరావు, ఎంపిటిసి తేనెల గౌరీశ్వరి, సురేష్‌కుమార్, సూర్యకుమార్ ఉన్నారు.

## క్రైమ్ కార్నర్



గణపతిరావు మృతదేహం

### గల్లంతైన మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం మూలపేట-సంధిపేట సముద్రతీరంలో మంగళవారం ఉదయం గుంటు గణపతిరావు మృతదేహం లభ్యమైంది. ఈ నెల 9న గార మండలం బందరువానిపేట వద్ద సముద్రంపై వేటకు వెళ్లిన బోటు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో సముద్రంలో పడిన ఆరుగురిలో నలుగురు ఈదుకుంటూ ఒడ్డుకు చేరిపోయారు. అదే రోజు సంతబొమ్మాళి మండలం చెరువుగట్టుపేట-పిట్టవానిపేట సముద్ర తీరానికి పక్కల లక్ష్మయ్య మృతదేహం చేరింది. గుంటు గణపతిరావు మృతదేహాన్ని మెరైన్ పోలీసులు, స్థానికులు రెండు రోజుల పాటు గాలింపు చేపట్టారు. అయితే మంగళవారం ఉదయం సందిపేట తీరానికి చెరువులో మృదేహాన్ని గుర్తించిన కొందరు వ్యక్తులు మెరైన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. బోటు ప్రమాదం గల్లంతయిన గణపతిరావు మృతదేహంగా మెరైన్ పోలీసులు గుర్తించారు. నౌపడ పోలీసులు మృతదేహాన్ని శవపంచనామా నిర్వహించిన పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

### వృద్ధురాలి ఆత్మహత్య

**టెక్కలి రూరల్ :** మండలంలోని సీతారాంపల్లికి చెందిన బోలుపద్ర గరికమ్మ (62) సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గరికమ్మకు కొంతకాలం గా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. ఎన్ని మందులు వాడినా తగ్గకపోవడంతో మనస్తాపానికి గురైంది. దీంతో సోమవారం రాత్రి సూపర్వాస్మాల్ తాగి అస్వస్థతకు గురైంది. కుటుంబసభ్యులు హుటాహుటీన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందింది. మృతురాలికి భర్త గంగయ్య, కుమారులు వెంకటరావు, శోభనబాబు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఎస్ఐ-2 కె.రమేష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### జూదరుల అరెస్టు

**నౌపడ :** సంతబొమ్మాళి మండలంవిష్ణుచక్ర గ్రామ సమీపం కొబ్బరి తోటల్లో పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు నౌపడ ఎస్ఐ కిషోర్‌వర్మ తెలిపారు. ఈ దాడుల్లో ఆరుగురు వద్ద నుంచి రూ.14,490 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు. కొద్ది రోజులుగా పేకాట ఆడుతున్న సమాచారం రావడంతో దాడులు చేపట్టామన్నారు. పేకాట శిబిరాలపై నిఘా పెట్టామని అన్నారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**కొత్తూరు :** మండలంలోని ఆకులతంపరకు చెందిన పసల పాపారావు వంశధార నది నుంచి అక్రమంగా ట్రాక్టర్‌తో ఇసుకను తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎస్ఐ ప్రభాకరరావు మంగళవారం దాడి చేసి పట్టుకున్నారు. ఇసుక ట్రాక్టర్నుఉ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎఎస్ఐ శివాజీరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు యాదవుల ప్రజా సింహగర్జన

**శ్రీకాకుళం అర్బన్ :** ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ బహుజనులకు రాజ్యాధికారం సాధన కోసం నగరంలోని పెద్దపాడు రోడ్డులో ఉన్న పద్మావతి కళ్యాణ మండపంలో యదవుల ప్రజా సింహగర్జన నిర్వహిస్తున్నామని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిట్టా చంద్రపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గర్జన సభకు బొడే రామచంద్రయాదవ్ హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. ఈ సభను విజయవంతం చేయాలని కోరారు.

## హక్కుల సాధనకు పోరాటమే శరణ్యం



జెండాను ఎగురవేస్తున్న దామోదరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమస్యలను పరిష్కరించుకునేందుకు పోరాటమార్గమే సరైందని, 92 రోజుల పాటు అమరావతి జెఎసిలో భాగస్వాములుగా సాగించిన పోరాటంలో ఆర్‌టిసి ఉద్యోగులకు సంబంధించిన అనేక సమస్యలకు పరిష్కారం లభించిందని ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు అన్నారు. నగరంలోని ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో యూనియన్ 72వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు ఆర్‌టిసి యాజమాన్యంతో జరిగిన చర్చల్లో కొన్ని సమస్యలకు పరిష్కారం లభించిందన్నారు. శుక్రవారం ఉద్యోగుల సమస్యలను తెలుసుకునేందుకు గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేశారని అన్నారు. దీంతో వ్యక్తిగత సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.నానాజి, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.ఎస్.ఆర్.శర్మ, కె.గణేష్, జిల్లా అధ్యక్షులు త్రినాథ, కార్యదర్శి దశరథుడు పాల్గొన్నారు.

## త్యాగాలు మావి.. కాంట్రాక్టులు వారివా?

ప్రజాశక్తి- నౌపడ

మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్వాసితులు త్యాగాలు చేస్తే కొంతమంది పెత్తందారులు తమపై అజమాయిషీ చేసి కాంట్రాక్టర్లు తీసుకుంటున్నారని సర్పంచ్ బాబూరావు అన్నారు. ఈ మేరకు విజయవాడలోని రాజ్యసభ సభ్యుడు విజయ సాయిరెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులకు ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. జీడి చెట్లకు నష్టపరిహారంగా ఒక్కో చెట్టుకు రూ.5000 ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ.2,142 చెల్లిస్తామని చెప్పడం న్యాయం కాదన్నారు. అలాగే గ్రామంలో పలువురు నిర్వాసితులకు పిడిఎఫ్ పరిహారం ఇంకా అందలేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దువ్వాడ సోదరులు తమపై పెత్తనం చెలాయిస్తున్నారని చెప్పారు. నిర్వాసితుల ఉపాధి నిమిత్తం కాంట్రాక్టులు, సూపర్‌వైజర్ పనులు అప్పగించాలని ఆయనను కోరారు. రైతుల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములకు మార్కెట్ ధరలో సగం ఇస్తామని ప్రభుత్వం మాట ఇచ్చిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో జీరు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ బాబూరావు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న హెచ్‌ఎంలు

## సమస్యలు పరిష్కరించాలని వినతి

**టెక్కలి :** టెక్కలి డివిజన్ పరిధిలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నెలకున్న సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని టెక్కలి డివిజన్ ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి గార పగడాలమ్మను మంగళవారం కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ అసిస్టెంట్లను నియమించాలన్నారు. వివిధ యాప్‌ల పేరుతో ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి పెరుగుతుందన్నారు. నాడు-నేడు పనుల్లో ప్రధానోపాధ్యాయులను పర్యవేక్షణకు మాత్రమే వినియోగించాలని కోరారు. దీనిపై ఆమె స్పందించి ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఆమెను కలిసిన వారిలో చిలుక కృష్ణారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వై.హరిబాబు, డివిజన్ కార్యదర్శి దాసుపురం చిన్నారావు, జిల్లా కౌన్సిలర్ ఎం.రామారావు, పి.విలియమ్ ఉన్నారు.



జి.సిగడాం : పాదయాత్రలో పాల్గొన్న వెంకటరావు


## 'యువగళానికి' అపూర్వ స్పందన

**జి.సిగడాం :** యువగళం పేరిట నారా లోకేష్ చేపడుతున్న పాదయాత్రకు ప్రజలను అపూర్వ స్పందన లభిస్తుందని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు అన్నారు. లోకేష్ 2000 కిలోమీటర్ల పాదయాత్రకు సంఘీభావంగా మెట్టవలస కూడలి నుంచి పాలఖండ్యాం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రలో ప్రతి నియోజకవర్గంలో వైసిపి నాయకుల భూమి బాగోతాన్ని, వారి బండారాన్ని బయట పెట్టడంతో వారు నీళ్లు తాగుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మెట్టవలస సర్పంచ్ కామోజులు, సీతారాం, ఎంపిటిసి బెవర జగన్నాథరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, కూర్మారావు, టంకాల మల్లేశ్వరరావు, పైల రామకృష్ణంనాయుడు, పైల బాబ్జి, కంచనాల సూరన్ననాయుడు, చిన్నారావు పాల్గొన్నారు.

**మెళియాపుట్టి :** మండలంలోని మారడికోట పంచాయతీలో నిర్వహించిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర 200 రోజులు పూర్తి కావడంతో సంఘీభావ పాదయాత్ర కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మంగళవారం నిర్వహించారు. అనంతరం భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను, టిడిపి ఇటీవల విడుదల చేసిన మినీ మేనిఫెస్టోను వివరించారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్ గౌడ, మాజీ సర్పంచ్ అగ్గాల శ్రీనివాసరావు, మజ్జి వీరన్న, కదంబల రాజు, బసవ పరమేశ్వర్‌రెడ్డి, బమ్మిడి భాస్కరరావు, హనుమంతు చంద్రశేఖర్, ఇప్పిలి కృష్ణారావు, ఉర్లాన వసంత్, ఎల్.భాస్కరరావు పాల్గొన్నారు.

**శ్రీకాకుళం అర్బన్ :** లోకేష్ పాదయాత్రకు మద్దతుగా నియోజకవర్గంలోని మూడు కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

**వజ్రపుకొత్తూరు :** లోకేష్ పాదయాత్రకు మద్దతుగా మండలంలోని అక్కుపెల్లి కూడలి నుంచి పూండి వరకు చేప్టిన టిడిపి బైక్ ర్యాలీని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ప్రారంభించారు. ముందుగా అక్కుపెల్లిలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు సురాడ మోహనరావు, మాజీ ఎంపిపి గరకల వసంతస్వామి, గోవింద పాపారావు, పి.సాంబమూర్తి, బి.శశిభూషణ్, కంటి సురేష్, అంబటి రామకృష్ణ, ఆకుల భాస్కరరావు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : పాదయాత్రలో పాల్గొన్న లక్ష్మీదేవి



వజ్రపుకొత్తూరు : పాల్గొన్న గౌతు శిరీష

**కవిటి:** యువగళం పేరిట నారా లోకేష్ చేపడుతున్న పాదయాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని, రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమని టిడిపి నాయకులు మణి చంద్ర ప్రకాష్, సీపాన రమణ, పొందల కృష్ణారావు తదితరులు అన్నారు. యువగళంలో భాగంగా నారా లోకేష్ 2000 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి చేసిన సందర్భంగా మండలంలో సంఘీభావ యాత్ర నిర్వహించారు. ఎమ్మెల్యే అశోక్ నివాసం నుంచి చింతామణి అమ్మవారి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బెందాళం రమేష్, సదానంద రౌలో, దక్కత ఢిల్లీరావు, కొర్రాయి వాసుదేవ్ యాదవ్, బాసుదేవ్ రౌలో, బార్ల చినబాబు, లీలారాణి పాల్గొన్నారు.

## సాయిరాజ్‌పై చర్యలు తీసుకోవాలి

**ఇచ్ఛాపురం:** ఉద్దానం కిడ్నీ వ్యాధి గురించి ప్రపంచ వ్యాప్తంగా తెలియజేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేయించిన వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్‌పై చర్యలు తీసుకోవాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు కోరారు. ఈ మేరకు ఎస్ఐ గోవిందరావును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 10న సోంపేటలో సాయిరాజ్ అధ్వర్యాన పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారని అన్నారు. దీనికి నిరసనగా మంగళవారం ఆందోళనకు పిలుపునిచ్చామని, పోలీసులతో గృహ నిర్బంధించడం దారుణమని అన్నారు. తిప్పన దుర్యోధన రెడ్డి, హరిబెహరా, ఈశ్వర్, నీలవేణి, శేఖర్ పాల్గొన్నారు.



ఫిర్యాదు చేస్తున్న రాజు

## పట్టు పరిశ్రమతో రైతులకు అధిక ఆదాయం

**పొందూరు:** పట్టు పురుగుల పెంపకంతో రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని జిల్లా పట్టుపరిశ్రమశాఖ అధికారి సిహెచ్.కె.రత్నకుమారి తెలిపారు. మండలంలోని రాపాకలో 'పట్టు బడి రైతు శిక్షణ' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సంర్భంగా ఉత్సాహవంతమైన రైతులు పట్టు పరిశ్రమపై విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా అధిక దిగుబడులను సాధించి ఆదాయాన్ని పొందవచ్చునని పేర్కొన్నారు. రైతులకు రేరింగ్ షెడ్డు నిర్మాణానికి ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.3.60 లక్షలు, బిసి, ఇతర రైతులకు రూ.3 లక్షలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. అలాగే మల్బరీ మొక్కలకు ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.22,500లు, బిసి, ఇతరులకు రూ.18,750 అందిస్తుందని పేర్కొన్నారు. పట్టుగూళ్లను జిల్లా పట్టుపరిశ్రమ కార్యాలయం వద్ద అమ్మకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. అనంతరం పట్టుసాగుపై పలు మెళకువలను, సూచనలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఒ జి.సన్యాసమ్మ, టిఎ ఎం.నరేష్, విఎఎ పి.ధనలక్ష్మి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న రత్నకుమారి

# జనాభా నియంత్రణ అవసరం



మాట్లాడుతున్న ఓబులేసు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

లయన్స్‌క్లబ్ సెంట్రల్ శ్రీకాకుళం ఆధ్వర్యాన నగరంలోని సన్ డిగ్రీ కళాశాలలో జనాభా దినోత్సవావంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న జనాభా వల్ల మౌలిక సదుపాయాల కల్పన, ప్రజల అవసరాలు తీర్చడం కష్టసాధ్యమవుతుందన్నారు. జనాభాకు తగినంత ఆహార పదార్థాలను ఉత్పత్తి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. భూ ఉపరితలంపై ఉన్న ప్రకృతి సిద్ధమైన వనరులను పూర్తిగా వినియోగించడంతో భవిష్యత్ తరాలకు వనరులు అందని పరిస్థితి ఎదురవుతుందన్నారు. అందువల్ల జనాభా నియంత్రణ తప్పనిసరన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్, క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, సెక్రెటరీ రామ్‌గోపాల్, సభ్యులు సీపాన రమేష్, సన్ డిగ్రీ కాలేజ్ కరస్పాండెంట్ పెద్దిన మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ జయరాం పాల్గొన్నారు.

లింగ వివక్షత లేని సమాజం ఆవిర్భవించాలంటే మహిళలు అన్ని రంగల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సురేఖ అన్నారు. కళాశాలలో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యాన ప్రపంచ జనాభా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి కె.సుధ పాల్గొని జనాభా పెరగడం వల్ల ఎదురయ్యే సమస్యలను వివరించారు. జనాభా పెరగడం వల్ల పర్యావరణపరంగా సహజ వనరుల పరంగా అనేక సమస్యలు ఉత్పన్నం కానున్నాయని వివరించారు. సమావేశంలో అర్థశాస్త్ర విభాగాధిపతి సిహెచ్.రామమూర్తి, సమన్వయకర్త డాక్టర్ డి.పైడితల్లి, సీనియర్ అధ్యాపకులు హెచ్.లక్ష్మీపతి, డాక్టర్ ఎం.చిన్నారావు, డాక్టర్ వై.పోలినాయుడు, డాక్టర్ శ్రీనివాస్‌పాత్రో, డాక్టర్ పి.వి.రమణ పాల్గొన్నారు.

**కవిటి:** అధిక జనాభాతో అభివృద్ధి కుంటుపడుతుందని, ప్రతి ఒక్కరూ జనాభా నియంత్రణకు కృషి చేయాలని బెలగాం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ రాకేష్ ఆచారి, డాక్టర్ కవిత అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని బెలగం పిహెచ్‌సిలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ మాదిన కృష్ణారావు, లేబ్ అసిస్టెంట్ బెందాలం శివప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ బి.మంగమ్మ, పిహెచ్ఎన్ టి.రమణమ్మ పాల్గొన్నారు.

**టెక్కలి :** డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ అధ్యక్షతన ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బేపల సతీష్‌కుమార్, అర్థశాస్త్ర విభాగాధిపతి ఎ,రామారావు, కో-ఆర్డినేటర్ ఎ.రామారావు, ఎం.బాలకృష్ణ, కోటేశ్వరరావు, త్రినాతరావు, జగన్నాథ్ బిసాయ్, ధర్మారావు, కంచరాన శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మురళీమోహన్‌ను సన్మానిస్తున్న వాకర్స్

## పర్యావరణ పరిరక్షణకు సమిష్టి కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పర్యావరణ పరిరక్షణకు రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్, స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేస్తుందని నూతన అధ్యక్షులు ఎరుకోల మురళీమోహన్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన మంగళవారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర సుందరీకరణకు తన వంతు సహకారాన్ని అందజేస్తానని అన్నారు. నాగావళి నది కాలుష్య నివారణకు అందరి సహకారం అవసరమన్నారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి బాటలు వేసే కార్యక్రమంలో వాకర్స్ సంస్థల సహకారాన్ని తీసుకుంటామని అన్నారు. కోడిరామ్మూర్తి స్టేడియం నిర్మాణానికి సమిష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు, వాకర్స్ మాజీ గవర్నర్ జి.ఇందిరాప్రసాద్, వాకర్స్ ఇంటర్నేషనల్ రీజినల్ కౌన్సిలర్ కూన వెంకట రమణమూర్తి, వాకర్స్ డిప్యూటీ గవర్నర్ సుగంధం సంజీవరావు పాల్గొన్నారు.

## రీ సర్వే పరిశీలన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రీ సర్వేతో భూముల సమగ్ర నిర్వహణకు అవకాశం కలుగుతుందని సైనూరు సర్పంచ్ అట్టాడ గోవిందరావు అన్నారు. మండలంలోని సైనులు సచివాలయం పరిధిలో నిర్వహించిన జగనన్న భూ రక్ష-శాశ్వత భూ హక్కు కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. పొల్లాడలో 414 ఎకరాలు, సైనురులో 144 ఎకరాలు, సుంకర జగన్నాథపురంలో 266 ఎకరాలకు సరిహద్దులను సర్వే, రెవెన్యూ అధికారులు గుర్తించారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి గుంటూరు మాకయ్య, విఆర్ఒ భానుచందర్, సర్వేయర్ గోపి, రమేష్, గౌతం, సచివాలయ కన్వీనర్లు మార్పు రవికుమార్, గోకిన గణపతి, బాబూరావు, భాస్కరరావు, రామారావు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాల సందర్శన

**మెళియాపుట్టి :** మెనూ సక్రమంగా అమలు చేయాలని తహశీల్దార్ పి.సరోసని హెచ్చరించారు. మండలంలోని పెద్దలక్ష్మీపురం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను మంగళవారం సందర్శించారు. మధ్యాహ్నభోజనం, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఈమె వెంట ఆర్ఐ వైకుంఠరావు, విఆర్ఒ అన్నాజీరావు, ఉపాధ్యాయులు దుర్గారావు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.


సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

## సేవలే గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

ఉద్యోగులు చేసిన సేవలే వారికి గుర్తింపునిస్తాయని బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణారావు అన్నారు. పాఠశాలలో చక్కని సేవలు అందించి బదిలీపై వెళ్లిన పూర్వ ప్రధానోపాధ్యాయులు తంగి వెంకటరమణమూర్తి, ఉపాధ్యాయులు పి.తిరుపతిరావు, బి.తాత రావు, బి.లక్ష్మణరావు, చమళ్ల కృష్ణారావు, పి.ఎర్రయ్య, బి.శాంతారావు, పి.అప్పలరాజులను విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తే... సమాజ మన్ననలు పొందగలరని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల టి.వి.రమణమూర్తి, టి.లోకేశ్వరరావు, డి.ఉమాశంకర్, త్రినాథరావు, ఉమాదేవి పాల్గొన్నారు.

## ఈ-క్రాప్ చేయించుకోవాలి

**ఇచ్ఛాపురం :** గతేడాది చాలా మంది రైతులు ఈక్రాప్ చేయించుకోలేని పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించలేదని రైతు కుల సంఘం నియోజకవర్గ కన్వీనర్ జన్నెల ప్రసాదరావు అన్నారు. స్థానిక ఎల్లమ్మ ఆలయం వద్ద రైతు కుల సంఘం ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతేడాది ఈక్రాప్ లేక రైతులు ధాన్యం మద్దతు ధరకు నోచుకోలేదన్నారు. దీంతో దళారుల చేతిలో మోసపోవాల్సి వచ్చిందన్నారు. అదేవిధంగా జీడికి మద్దతు ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. బాహుదా నదిలో బెల్లుపడ ఛానల్‌కి ఎంపీ రామ్మోహన్ నాయుడు నిధులు విడుదల చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో ఆసీ చిరంజీవులురెడ్డి, కూర్మారెడ్డి, చాట్ల లోహిదాస్‌రెడ్డి, ఉప్పాడ చిన్నబాబురెడ్డి, దక్కత విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

## కిడ్నీ బాధితునికి అండ

**కవిటి:** మండలంలోని యర్ర గోవిందపుట్టుగకు చెందిన కిడ్నీ బాధితులు కన్ను కూర్మమ్మకు స్థానిక స్వచ్ఛంద సంస్థ ఎస్‌జిఎఫ్ అండగా నిలిచింది. నిరుపేద కుటుంబానికి చెందిన కూర్మమ్మ కొన్నేళ్లుగా కిడ్నీ మహమ్మారితో పోరాడుతోంది. ప్రస్తుతం ఆమెకు పూట గడవడమే కష్టంగా మారిందని గ్రామ యువత ద్వారా తెలుసుకున్న ఎస్‌జిఎఫ్ సభ్యులు మంగళవారం గ్రామానికి చేరుకున్నారు. కూర్మమ్మ వైద్య ఖర్చుల కోసం తక్షణ సహాయంగా రూ.6 వేలు అందించారు. అనంతరం ఎస్‌జిఎఫ్ సభ్యులు మాట్లాడుతూ మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందు కొచ్చి కూర్మమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

## బోర్లకు మరమ్మతులు

**పలాస :** పలాస బత్తులవీధిలో పాడైన బోర్లకు మున్సిపల్ అధికారులు మంగళవారం మరమ్మతులు చేపట్టారు. వారం రోజులుగా తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ టి.నాగేంద్ర కుమార్ ఆదేశాల మేరకు మున్సిపల్ డిఇఇ బల్ల హరి పర్యవేక్షణలో రెండు బోర్లను మరమ్మతులు చేపట్టారు. అనంతరం ప్రజలకు తాగునీరు అందేలా చర్యలు చేపట్టారు.


మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

# ఎంపీ దృష్టికి వికలాంగుల సమస్యలు


వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

**కంచిలి :** రైళ్లలో వికలాంగులు సురక్షితంగా, ఇబ్బందులు లేకుండా ప్రయాణించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మాదిన రామారావు, నాయకులు దుర్గా శ్రీను, బోడ్డ హరిబాబు, కిరణ్ కోరారు. జిల్లా కేంద్రంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రైల్‌లోనూ వికలాంగులకు ప్రత్యేకమైన భోగిని కేటాయిస్తున్నారని అన్నారు. కానీ, ఆ భోగిల్లో సాధారణ ప్రయాణికులు ఎక్కడంతో వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ విషయాన్ని రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి వికలాంగులు సురక్షితంగా ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు రామారావు తెలిపారు.

## ప్లాస్టిక్‌ను నిషేధించాలి

ప్రజాశక్తి- నౌపడ

గ్రామాల్లో చెత్త నివారణకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని టెక్కలి డిఎల్‌పిఒ ఐ.వి.రమణ పిలుపునిచ్చారు. సంతబొమ్మాళి మండలం భావనపాడు గ్రామ సచివాలయం వద్ద సబ్ కలెక్టర్ ఆదేశాలతో సర్పంచ్ బి.మోహన్‌రెడ్డి అధ్యక్షతన గ్రామస్తులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పంచాయతీ ప్లాస్టిక్ నిషేధించాలని కోరారు. సముద్రతీరాన ఉన్న చెత్తను తొలగించేందుకు అందరం సమిష్టి కృషితో పనిచేయాలన్నారు. గ్రామస్తులు అధికారులతో చెత్త నివారణపై ప్రతిజ్ఞ చేయించారు.


ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

అనంతరం చెత్త నివారణ నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి భూషణరావు, పంచాయతీ కార్యదర్శి బి.వి.రాజు, ఉపసర్పంచ్ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఢిల్లీరావు

## బిసి హక్కులను అమలు చేయాలి

ప్రజాశక్తి- సోంపేట

రాజ్యాంగం బిసి ప్రజలకు ఇచ్చిన హక్కులను అమలు చేయడంలో అటు ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం తగదని ఆల్ ఇండియా బిసి సంఘం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేన ఢిల్లీరావు అన్నారు. సోంపేటలోని ఆలయం వద్ద బిసి నాయకులతో సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకే వృత్తి ఉన్న రెండు, మూడు జాతులకు వేర్వేరు కేటగిరీలో రిజర్వేషన్లు కల్పించడంతో చాలా సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. దేశంలో ఒకే వృత్తి చేస్తున్న వారందరినీ ఒకే కేటగిరీ కిందకు తెచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి సంబంధించి బిసి సంఘ నాయకుడు కృష్ణయ్యకు నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఇ. శ్రీనివాసరావు, ఢిల్లీరావు, దుమ్ము మోహనరావు, జోగారావు, పైడి పట్టాభి, రామారావు, పి. హేమసుందర్, బి.అశోక్ పాల్గొన్నారు.

## పుస్తకాలు అందజేత

**పొందూరు:** యూత్‌క్లబ్ ఆఫ్ బెజ్జిపురం ఆధ్వర్యాన జరుగుతున్న స్కూల్ రెడీనెస్, బాలవికాస్‌లో భాగంగా మండలంలోని లైదాం, తోలాపి, లోలుగు పాఠశాలల గ్రంథాలయాలకు పుస్తకాలను ఎంఇఒలు పి.వి రామరాజు, పి.రాజారావు అందజేశారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ సమావేశ మందిరంలో మంగళవారం ప్రధానోపాధ్యాయులతో మండలస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ-1 రామరాజు మాట్లాడుతూ పాఠశాలల్లో సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. జగనన్న విద్యా కానుకల కిట్లను అందిచడంతో పాటు మెనూ అమలులో ఆలసత్వం చూపవద్దని సూచించారు. సమావేశంలో ఎంఇఒ-2గా పనిచేసిన ఎపిఎం గురుగుబెల్లి శ్యామలరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇండియా లిటరసీ ప్రాజెక్టు కమ్యూనిటీ ఆర్గనైజర్స్ కె.శ్రావణి, జి.హేమసుందర్ పాల్గొన్నారు.